సంపుటి - 6 ఏప్రిల్- 2023 సంచిక - 8

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం............................................3

పునరుత్థానం........................................................6

విశ్వాసి జీవిత సాక్ష్యం ............................................8

పునీత బెర్నదెత్తమ్మ.............................................10

బైబిల్ దర్శనం....................................................12

శుభవచనం బైబిల్ క్విజ్.......................................15

ఇంద్రధనుస్సు.....................................................17

ఏంజెల్స్ కార్నర్.................................................18


యువ స్పందన ...................................................19

బైబిల్ దృశ్యమాలిక............................................21

శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23











**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**



**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో
ఫాదర్ ఎబిన్
Mr. M. సత్యం
సిస్టర్ క్రిస్టీన CMC
Mrs. K. శ్రీలత
Mr. J. లూర్థు స్వామి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
మంచిర్యాల- 504 208
మంచిర్యాల జిల్లా
తెలంగాణ

Cell: 09398764408

Email ID - jeevaswarammagazineadb@gmail.com

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**“క్రీస్తే లేవనెత్తబడనిచో,**

**మా బోధన వ్యర్థమే.**

**మీ విశ్వాసమును వ్యర్థమే”**

**(1 కొరింతీ 15, 14)**

**ఫిబ్రవరి నెల**

**శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు**

మొదటి బహుమతి

**ఆర్. శ్రీలత, ఇంద్రవెల్లి**

రెండవ బహుమతి

**ఓ. సునీల్, జెండావెంకటపూర్**

మూడవ బహుమతి

**సిస్టర్. మార్గరేట్ MSMI, ఆసిఫాబాద్**

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

**ఫిబ్రవరి నెల**

**ఇంద్రధనుస్సు విజేతలు**

మొదటి బహుమతి

**ఎమ్. మనసాత్విక, మందమర్రి**

రెండవ బహుమతి

**ఎస్. హర్షిత్, ఇంద్రవెల్లి**

మూడవ బహుమతి

**పి. రశ్మిత, బెల్లంపల్లి**

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

# తండ్రి గారి సందేశం....



## తపస్సు కాలం - నూతన జీవితానికి నాంది

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

మనమందరం పవిత్ర వారములోకి ప్రవేశించబోతున్నాము. ఈ సందర్భంగా యేసు ప్రభు మరణానికి కారకులు ఎవరు అని మనం ధ్యానిద్దాం.

“దేవుని సంకల్పమును అనుసరించియు, ఆయన భవిష్య జ్ఞానమును అనుసరించియు, అప్పగింపబడిన ఈ యేసును మీరు న్యాయ రహితుల చేతల గుండా సిలువ వేయించి చంపింతిరి” (అ.కా 2,23). పేతురు ఆనాడు పెంతకోస్తు పండుగన అక్కడ చేరియున్న యూదులందరిని ఉద్దేశించి ప్రసంగిస్తూ మీరు యేసుప్రభువును న్యాయరహితుల చేతికి అప్పగించి సిలువ వేసి చంపారు అని అన్నాడు. యేసు ప్రభు మరణానికి కారకులు యూదులు అని పేతురు ప్రకటిస్తున్నాడు. యూదులు యేసు ప్రభువును సిలువ మరణానికి గురిచేశారు. యూదులే యేసుప్రభుని పిలాతుని వద్దకు తీసుకొనివెళ్ళారు. యూదుల ప్రధానార్చకులు యేసు ప్రభువుపై నేరారోపణ చేసారు. ఆయనకు శిక్ష విధించాలని, కోరుకున్నారు. అది జరిగింప చేసారు. పేతురు యూదులతోనే ముక్కు సూటిగా ఈ మాటలు అన్నాడు. అదే విధంగా “పవిత్రుడు, నీతిమంతుడు అయిన యేసును విడుదల చేయు మనుటకు బదులు మీరు నరహంతకుని విడుదల చేయుమని అడిగితిరి. కనుక, మీరు జీవనకర్తను చంపియున్నారు. ఐనను దేవుడు మృతుల నుండి లేపెను. మేము దీనికి సాక్షులము” (అ.కా. 3,14-15) అని కూడా ప్రకటించాడు. “యూదుల దేశములోను, యెరూషలేములోను ఆయన చేసిన వానికి అన్నిటికిని మేము సాక్షులము. వారు ఆయనను సిలువ వేసిరి” (అ.కా. 10,39). వారు ఎవరు? యెరూషలేములో ఆ కాలంలో జీవించిన వారు, యూదయ ప్రాంతంలో జీవించినవారు యేసు ప్రభు సిలువ మరణానికి కారకులు అని పేతురు చాలా స్పష్టంగా ప్రకటిస్తున్నాడు.

యదార్ధంగా యూదులు యేసు ప్రభుని చంపించారని పేతురు చెప్తున్నప్పటికీ దానిలో ఒక సందేహం ఉంది. ఎందుకంటే యేసు ప్రభు “ఎవరు నా ప్రాణమును తీయలేరు. నా అంతట నేను నా ప్రాణమును ధారపోయుదును” అని అన్నాడు. యేసు ప్రభు మరణం ఎవరి ఒత్తిడి వలనో, లేక గత్యంతరము లేకనో ఎవరో ఏదో చేసినందుకు జరిగినది కాదు. దేవుని సంకల్పమును అనుసరించి, ఆయన భవిష్య జ్ఞానమును అనుసరించి ఆయన మరణం జరిగినదని పేతురు అంటున్నాడు. దేవుడు తన చిత్త ప్రకారం దీనిని జరిగింప చేసాడు. దాని జరిగింప చేయడానికి యూదులు తోడ్పడ్డారు. అలాగైతే యూదులు చేసింది తప్పా, ఒప్పా? యూదులు చేసింది పాపమా,

పుణ్యమా? దేవుడు తన సంకల్పాను సారము జరగాలని తీర్మానించుకున్నప్పుడు వారు తోడ్పడ్డారు. అలాగైతే వారు చేసింది పాపమెందుకు అవుతుంది?

ఇప్పుడు మన ముందు రెండు వైరుద్యాలు కనబడుతున్నాయి. దీని గురించి ఇంకా ధ్యానించినట్లైతే మనకు జవాబు దొరకుతుంది.

మొదటిగా, దేవుడు తన భవిష్య జ్ఞానమున, తన సంకల్పానుసారమున యేసు ప్రభు మరణించాలని నిర్ణయించుకున్నాడు. అంటే యేసు ప్రభు మరణించడం గురించి దేవుడు ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. యేసు ప్రభు దేవుని సంకల్పానుసారం, దేవుని చిత్తానుసారము, దేవుని భవిష్య జ్ఞానముననుసరించి తన శరీరాన్ని, తన జీవితాన్ని అర్పించడానికి సిద్ధపడ్డాడు. మనం కొన్ని వాక్య భాగములను పరిశీలించి చూసినట్లయితే ఈ విషయం మనకు అర్థమవుతుంది. "నేను నా తండ్రిని ప్రార్థింపలేనను కొంటివా? ప్రార్థించిన ఈ క్షణమున ఆయన పండ్రెండు దళముల కంటె ఎక్కువమంది దూతలను పంపడా? ఇట్లు కాదేని, ఈ విధముగా జరుగవలెనను లేఖనములు ఎట్లు పరిపూర్ణమగును? అనెను" (మత్తయి 26,53-54). యేసు ప్రభు తన మరణం గురించి వ్రాయబడిన లేఖనాలన్నీ జరగాలని కోరుకుంటున్న వ్యక్తి. ఆయన తనను తాను బలిగా అర్పించడానికి ఇష్టపడుతున్నట్లు మనం చూస్తున్నాము. "ఏలయన మనుష్యకుమారుడు సేవించుటకే గాని, సేవింపబడుటకు రాలేదు. ఆయన అనేకుల రక్షణార్థము విమోచన క్రయ ధనముగ తన ప్రాణమును ధార పోయుటకు వచ్చెను" (మార్కు 10,45). ఆయన శరీరమును ధారపోయుటకు ఆయనకు మాత్రమే అధికారముంది. ఆయన తన శరీరాన్ని, తన జీవితాన్ని ధారపోయడానికి భూలోకానికి వచ్చారని ప్రకటిస్తున్నాడు. ఎందుకు యేసు ప్రభు ఈ విధంగా చేసాడు అని ప్రశ్నించుకుంటే దానికి కారణం ఒకటే మన కొరకు, మన పాపముల పరిహారం కొరకు. మనం పరలోక రాజ్యం చేరాలనే ఉద్దేశంతో యేసుప్రభు ఈ సిలువ బలిని అర్పిస్తున్నాడు. ఇదే విషయాన్ని పౌలు గారు మనకు స్పష్టంగా నేర్పిస్తున్నాడు. "ఆయన ఎల్లప్పుడును దైవ స్వభావమును కలిగి ఉన్నను, దేవునితో తన సమానత్వమును గణింపలేదు. ఇది గ్రహింపవలసిన విషయము. కాని ఆయన తన్ను తాను రిక్తుని చేసికొని, సేవక రూపమును దాల్చి మానవ మాత్రుడుగా జన్మించెను. ఆయన అన్నివిధముల మానవమాత్రుడై ఉండి, అంతకంటె వినయముగలవాడై, మరణము వరకును, సిలువపై మరణము వరకును, విధేయుడాయెను" (ఫిలిప్పీ 2,6-8). యేసు ప్రభు తనను తాను తగ్గించుకొని బలిని అర్పించడానికి ఇష్టపడుతున్నాడు. యేసు ప్రభు 'సమాప్తమైనది' అని తలవంచి, తన ప్రాణము విడిచెను (యోహాను 19,30). యేసు ప్రభు శ్రమలు అనుభవించిన తరువాత తను సంకల్పించిన రక్షణ కార్యం 'సమాప్తమైనది' అని ధైర్యంగా ప్రకటించాడు. తనకు తాను స్వతంత్రంగా ఈ సిలువ బలిని అర్పిస్తున్నానని చెప్పుతున్నాడు.

దేవుని కుమారుడైన యేసు ప్రభువే ఈ విధంగా పరమ పితయైన దేవుని సంకల్పానుసారం జీవించడానికి ఇష్టపడినట్లైతే, దేవుని భవిష్య జ్ఞానము అనుసరించి తన జీవితంలో బాధలను, శ్రమలను అనుభవించడానికి ఇష్టపడినట్లైతే, దేవుని బిడ్డలమైన

మనం కూడా దేవుని సంకల్పానుసారం జీవించడానికి, దేవుని భవిష్య జ్ఞానమును అనుసరించి జీవించడానికి, దేవుని చిత్తం మన కుటుంబాలలో, మన జీవితాలలో నెరవేరాలని కోరుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ఎటువంటి కష్టం వచ్చినా దేవుని చిత్తమే నెరవేరును గాక అనే ప్రార్ధనను మనం అలవరచుకోవాలి.

రెండవదిగి, యూదులు యేసు ప్రభు మరణానికి కారకులు. వారే యేసు ప్రభుని పిలాతు వద్దకు తీసుకొని వెళ్ళారు. వారే మరణ శిక్ష విధింప చేయడానికి కారకులు అయ్యారు. సాధారణంగా యూదులు చేసింది తప్పే అని మనకు అనిపిస్తుంది. పేతురు గారు ముక్కు సూటిగా యూదులను ఉద్ధేశించి మీరే ఆయన మరణానికి కారకులు అని అంటున్నారు. మీరు పవిత్రమైన యేసు ప్రభుని కాదనుకొని నరహంతకున్ని కోరుకున్నారు, మీరే ఆయనను సిలువ మరణానికి విధింప చేసారు అని అంటున్నారు. కాని అ.కా 2,23 ప్రకారం, సిలువ మరణం దేవుని సంకల్పానుసారం జరిగిందని మనం ఇంతకు ముందే ధ్యానించాము. అలాగైతే యూదులు చేసింది తప్పు కాదు అని మనకు అనిపిస్తుంది. కాని ఆ వాదన అంతటితో ఆగిపోదు. పిలాతు “ఈ నీతిమంతుని రక్తము విషయమున నేను నిరపరాధని. అది మీరే చూచుకొనుడు” అని అన్నప్పుడు “ఆయన రక్తము మాపై, మా బిడ్డలపై పడునుగాక!” అని ప్రజలు కేకలు వేసారు. (మత్తయి 27,24-25). మొదటి కారణం ప్రకారం, దేవుని సంకల్పాను సారంగా యేసు ప్రభు మరణం జరిగింది. అప్పుడు యూదులు చేసింది తప్పు కాదు అని మనం అనుకుంటాము కాని యూదులు తమంతట తాము గానే ఈ మరణ శిక్షకు కారకులు మేమే, ఒకవేళ ఈ మరణ శిక్ష ద్వారా ఏదైన పాపము వచ్చినట్లైతే, ఆ రక్తము మాపై, మా బిడ్డలపై పడునుగాక అని తమంతట తాము కోరుకుంటున్నారు. అందుకే వారు యేసు ప్రభు మరణానికి కారకులు.

యూదులపైన ద్వేషభావాన్ని పెంచుకునే వారు చాలా మంది ఈ లోకంలో ఉన్నారు. యూదులంటే పడని వారు చాలా మంది ఉన్నారు. వారు యేసు ప్రభు మరణానికి కారకులు అయ్యారన్నదే కారణం. యేసు ప్రభు మరణానికి భౌతికమైన, లౌకికమైన కారణం యూదులు. కాని, యేసు ప్రభు మరణానికి ఆధ్యాత్మికమైన కారణం వేరొకటి ఉంది. ఆ కారణం తెలుసుకున్న తరువాత మనం యూదులను నిందించము, ద్వేషించము.

పాపము చేసిన ప్రతి ఒక్కరు యేసు ప్రభు మరణానికి కారకులు అని పరిశుద్ధ గ్రంథం మనకు స్పష్టంగా నేర్పిస్తుంది. “ఆయన ఎట్టి పాట్లు పడెనో, పాపాత్ముల విద్వేషము నెట్లు సహించెనో ఆలోచింపుడు!” (హెబ్రీ 12,3). మనలను ప్రేమించడం కొరకు ఆయన ఈ సిలువ బలిని స్వీకరించాడు. “ఈ నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు. ఏలయన, దేవుడు మనకొసగిన పవిత్రాత్మ ద్వారా తన ప్రేమతో మన హృదయములను నింపెను. మనము బలహీనముగ ఉన్నప్పుడే నిర్ణీత కాలమున దైవహీనుల కొరకై క్రీస్తు మరణించెను. ఎందువలన? నీతిమంతుని కొరకు కూడ ప్రాణములను ఇచ్చుట అంత సులభము కాదు. బహుశ: సత్పురుషుని కొరకై ఒకడు తన ప్రాణములను ఇచ్చుటకు సిద్ధపడునేమో. కాని, **మనము పాపాత్ములమై ఉన్నప్పుడే క్రీస్తు మన కొరకై మరణించెను గదా!** ఇట్లు దేవుడు మనపై తనకు ఉన్న ప్రేమను చూపుచున్నాడు”

(రోమీ 5,6-8). యేసు ప్రభు మనపై ఉన్న ప్రేమను చూపించడానికి ఆయన సిలువ బలిని స్వీకరించాడు. పాపం చేసిన వారందరు ఆయన సిలువ మరణానికి కారకులు. “ఐనను భ్రష్టులైరి. వారు దేవుని కుమారుని తిరిగి సిలువ వేయుచు బహిరంగముగ అవమానముల పాలు చేయుచున్నందున, వారిని పశ్చాత్తాపమునకు తిరిగి మరల్చుట అసాధ్యము” (హెబ్రీ 6,6). “వ్రాత పూర్వకమైన ఆజ్ఞల వలన మన మీద ఋణముగాను, **మనకు విరుద్ధముగాను ఉండిన పత్రమును ఆయన తన సిలువ మరణము ద్వారా మనకు అడ్డము లేకుండ తొలగించెను**” (కొలొస్సీ 2,14). పాపపు మూలముగా పతనమైన మన మానవ జాతిని యేసు ప్రభు తన రక్తాన్ని చిందించి రక్షించాడు. ఈ విధంగా చూసినట్లైతే పాపం చేసిన వారందరు ఆయన మరణానికి కారకులు. ఇంతకుముందు పాపం చేసిన వారు, ఇప్పుడు చేస్తున్న వారు, భవిష్యత్తులో పాపం చేసే వారందరు ఆయన మరణానికి కారకులే. యేసు ప్రభు మరణానికి కారకులు ఎవరు అని వెదుక్కోవడానికి ముందు, మనం వెదకాల్సిన ఇంకొక ప్రశ్న ఉంది. నేను యేసు ప్రభు మరణానికి కారకున్నా, కారకురాలినా? నేను కూడా వ్యక్తిగతంగా యేసు ప్రభు మరణానికి కారకున్ని అని తెలుసుకోవాలి. “కనుక ఇక జీవించునది నేను కాదు. క్రీస్తే నా యందు జీవించుచున్నాడు. **నన్ను ప్రేమించి నా కొరకై ప్రాణత్యాగము చేసిన దేవుని పుత్రుని యందలి విశ్వాసము చేతనే ఇప్పుడు నేను శరీరమందలి ఈ జీవితమును గడుపుచున్నాను**” (గలతీ 2,20). “**ఆయన మన బలహీనతలను తనపై వేసికొనెను. మన రోగములను తానే భరించెను**” (మత్తయి 8,17). మన కొరకు, మన పాపముల కొరకు, మన బలహీనతల కొరకు మరణించాడు. మన రక్షణ కొరకు, మనం పరలోక రాజ్యం చేరాలని ఆశతో ఆయన సిలువ బలికి తనకు తాను అర్పించు కుంటున్నాడు. మనము ఆయన సిలువ మరణానికి కారకులము అని తెలుసికొని పశ్చాత్తాపపడి ఆయన దగ్గరికి తిరిగి వద్దాం. తప్పిపోయిన కుమారున్ని రెండు చేతులు చాచి ఆహ్వానించిన తండ్రిలాగా యేసు ప్రభు మనల్ని కూడా క్షమించడానికి, మనల్ని దగ్గరికి చేర్చుకోవడానికి ఆయన తన రక్తాన్ని ఇచ్చి కొనుకున్న మనల్ని ప్రేమించడానికి సిద్ధంగా ఉన్నాడు. యేసు ప్రభు మన కొరకు సిలువ బలిని, శ్రమలను, అవమానాలను, హింసలను స్వీకరించడానికి ఇష్టపడ్డాడు. యేసు ప్రభు మనల్ని ప్రేమించి ఆయన శ్రమలు అనుభవించినట్లైతే, మనం ఆయనను ప్రేమిస్తున్నామా? విశ్వాసంలో ముందుకు సాగుతున్నామా?, ఆయన చిత్త ప్రకారం జీవిస్తున్నామా? మనం ఆత్మ పరిశీలన చేసుకుందాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# పునరుత్థానం

1. యేసు "నేనే పునరుత్థానమును జీవమును. నన్ను విశ్వసించువాడు మరణించినను జీవించును. జీవము ఉండగా నన్ను విశ్వసించు ప్రతివాడు ఎన్నటికిని మరణింపడు" (యోహాను 11,25-26).

2. "మన ప్రభువగు యేసు క్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక! మృతులలో నుండి యేసు క్రీస్తును ఆయన పునరుత్థానమొనరించి, దాని మూలమున మనకు నూత్న జీవమును ప్రసాదించెను. విశిష్టమగు ఆయన కనికరమే దీనికి కారణము. ఇది మనలను సజీవమగు నిరీక్షణతో నింపును" (1 పేతురు 1,3).

3. "ఏలయన, ఒక మనుష్యుని మూలమున మరణము ప్రవేశించినట్లే, మృతుల పునరుత్థానము కూడ ఒక మనుష్యుని మూలముననే వచ్చినది"
(1కొరింతీ 15,21)

4. "క్రీస్తును తెలిసికొనవలెననియు, ఆయన పునరుత్థాన ప్రభావమును అనుభవింపవలెననియు నా వాంఛ. ఆయన శ్రమలలో పాల్గొనవలెననియు, మృత్యువు నందు ఆయనను పోలియుండవలయుననియు మాత్రమే నా కోరిక" (ఫిలిప్పీ 3,10).

5. "ప్రభువైన యేసు పేనరుత్థానమును గూర్చి అపోస్తలులు మహాశక్తితో సాక్ష్యము లిచ్చిరి. సర్వేశ్వరుడు తన దైవకృపను సమృద్ధిగా వారిపై కుమ్మరించెను" (అపోస్తలులు 4,33).

6. ఆయన ఇక్కడ లేడు, లేచి యున్నాడు. మనుష్య కుమారుడు పాపుల చేతికి అప్పగింపబడి, సిలువ వేయబడి, మూడవ రోజున సజీవుడై లేవవలయునని మీతో చెప్పెను గదా! ఆయన గలిలీయలో ఉన్నప్పుడు మీతో చెప్పిన మాటలు స్మరింపుడు" (లూకా 24,6-7)

7. "క్రీస్తు యేసే! ఆయన చనిపోయి జీవముతో లేవనెత్తబడి, దేవుని కుడిప్రక్కన ఉండి మన మధ్యవర్తిగా మన కొరకై విజ్ఞానన చేయువాడు" (రోమీ 8,34).

8. "ఆయన అన్నివిధముల మానవమాత్రుడై ఉండి, అంత కంటె వినయముగలవాడై, మరణము వరకును, సిలువపై మరణము వరకును, విధేయుడాయెను" (ఫిలిప్పీ 2,8).

9. "దేవుడు ప్రభువును మృతుల నుండి లేవనెత్తెను. ఆయన మనలను కూడ తన శక్తితో లేవనెత్తును" (1 కొరింతీ 6,14).

10. "ఏలయన, మరణము నుండి లేవనెత్తబడిన క్రీస్తు మరల మరణింపడని మనకు తెలియును. మృత్యువునకు ఆయనపై ఇక ఎట్టి ఆధిపత్యము లేదు" (రోమీ 6,9).

11. "మీరు జీవనకర్తను చంపియున్నారు. ఐనను దేవుడు ఆయనను మృతుల నుండి లేపెను. మేము దీనికి సాక్షులము" (అపోస్తలులు 3,15).

12. "క్రీస్తు పాతాళములో విడువబడలేదు. ఆయన శరీరము క్రుళ్ళిపోలేదు అని దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను" (అ.కా. 2,31)

13. "ఆయన మరణములో మనము ఆయనతో ఏకమైయుండిన, ఆయన పునరుత్థానములో కూడ మనము తప్పక ఆయనతో ఏకమైయుందుము" (రోమి 6,5).

14. "మృత్యువు నుండి క్రీస్తు జీవముతో లేవనెత్తబడెను అని గదా మా సందేశము! మరి మృతుల పునరుత్థానము లేదని మీలో కొందరు ఎట్లు చెప్పుచున్నారు?" (1 కొరంతీ 15,12)

15. అతడు వారితో "మీరు భయపడకుడు. సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు. ఆయన పునరుత్థానుడయ్యెను. ఇక్కడ లేడు. వచ్చి ఆయనను ఉంచిన స్థలము చూడుడు" (మార్కు 16,6)

16. దూత స్త్రీలతో "భయపడకుడు. మీరు సిలువ వేయబడిన యేసును వెదకుచున్నారని నేను ఎరుగుదును. ఆయన ఇక్కడ లేడు. తాను చెప్పినట్లు సమాధి నుండి లేచెను. ఆయనను ఉంచిన స్థలమును చూడుడు" (మత్తయి 28,5-6)

17. "ఆయన ఇక్కడ లేడు, లేచియున్నాడు. మనుష్య కుమారుడు పాపుల చేతికి అప్పగింపబడి, సిలువ వేయబడి, మూడవ రోజున సజీవుడై లేవవలెనని మీతో చెప్పెను గదా! ఆయన గలిలీయలో ఉన్నప్పుడు మీతో చెప్పిన మాటలు స్మరింపుడు" అనిరి" (లూకా 24,6-7)

18. "ఏలన, జీవించియున్న వారిని, మరణించిన వారిని పాలించు నిమిత్తమే క్రీస్తు మరణించి సజీవుడయ్యెను" (రోమీ 14,9).

19. "నీ నోటితో యేసు 'ప్రభువు' అని ఒప్పుకొని, మృతులలో నుండి దేవుడు ఆయనను లేవనెత్తనని నీ హృదయమున నీవు విశ్వసించినచో నీవు రక్షింపబడుదువు" (రోమీ 10,9)

20. "నేను పొందిన దానిని మీకు మొదట అందించితిని. పరిశుద్ధ గ్రంథమున వ్రాయబడినట్లు క్రీస్తు మన పాపముల కొరకై మరణించెను. పరిశుద్ధ గ్రంథమున, వ్రాయబడినట్లు ఆయన సమాధి చేయబడి, మూడవ దినమున సజీవుడుగ లేవనెత్తబడెను" (1 కొరంతీ 15,3-4)



# విశ్వాసి జీవిత సాక్ష్యం

**గత సంచిక తరువాయి భాగం**

మనకున్నటువంటి సౌకర్యం, సౌలభ్యం ఆ రోజుల్లో లేదు. ఇంత సౌలభ్యం ఉండటం వల్లే మనలో స్వార్థం పెరిగి పోయింది. మనలో ధనాశ పెరిగి పోయింది. మన ఆలోచనా విధానం మారిపోయింది. మనమెప్పుడు ఏమి తిందుమా, ఏమి త్రాగుదుమా, ఏమి ధరించుదమా, ఈ లోకాన్ని ఎలా సంపాదించాలి, ధనాన్ని ఎలా సంపాధించాలి, ఎలా సుఖపడాలి? ఎప్పుడూ ఇలాంటి ఆలోచనలే! ఈ క్షణమే నీ గుండె ఆగిపోతే వెనక్కి తిరిగి చూసుకుంటే, ఏదయ్యా, నీ జీవిత సాక్ష్యం? ఏమి ఉండదండి! క్రైస్తవులమని పేరుకు చెప్పుకుంటున్నాము.

ప్రియ స్నేహితులారా! ఇది మన జీవితానికి తగదు. ఒక పౌలును చూస్తున్నాం, ఒక పేతురును చూస్తున్నాం. వారు మనకు నిర్దేశించిన మార్గం ఇది కాదు. చిట్టచివర మూడవ వ్యక్తి, ప్రభువు చేత అత్యంత ఎక్కువగా ప్రేమింపబడినటువంటి వ్యక్తి పునీత యోహాను. అతడు ఎంత గొప్పగా ప్రభువు పరిచర్య కోసం పని చేశాడో మనకు తెలియంది కాదు. అతడు చనిపోయే సమయానికే పెద్ద పెద్ద వాళ్ళందరు వెళ్ళిపోయారు. చిట్ట చివరిగా చనిపోయిన వాడు యోహాను. యోహానును బంధించి పత్మాసు ద్వీపంలో పడేశారు. అప్పటికి నీరో చక్రవర్తి చనిపోయాడు. డోమిషియన్ అనే వేరోక చక్రవర్తి పాలిస్తున్నాడు. ఈయన ఘణకార్యాలు కూడా తక్కువేం కాదు. తననే పూజించాలి. తననే మొక్కాలి, నమస్కారం కూడ తనకే

చేయాలి. తననే మొక్కాలి, నమస్కారం కూడ తనకే చేయాలి. నేనే దేవున్ని అని భ్రమపడి పోయేవాడు. క్రైస్తవ్యం ముక్కలు, చెక్కలు అయిపోయినటువంటి రోజులు అవి. దెబ్బల మీద దెబ్బలు తింటున్నారు క్రైస్తవులు. బాధాకరమైన పరిస్థితులను ఎదుర్కుంటున్నారు క్రైస్తవులు. నీరో కానివ్వండి, డొమీషియన్ కానివ్వండి. మహా క్రూరులు వీళ్ళు. అలాంటి క్రూరుల కాలంలో బ్రతికినటువంటి మహాను భావుల చరిత్రను ధ్యానిస్తున్నాం మనం. యోహాను ఆ పత్మాసు ద్వీపంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దర్శన గ్రంథాన్ని పూర్తి చేశాడు. తనువు చాలిస్తూ "ప్రభువా నీవు త్రాగుచున్న గిన్నెలో నుండి నేను కూడ కొంచెం త్రాగాను. నీవు పొందిన బాప్తిసము నేను కూడ పొందాను ప్రభువా! నీ కొరకు మరణించిన, నిన్ను ప్రేమించిన వాన్ని ప్రభువా నేను. ప్రభువు కొరకు ప్రాణాలర్పించిన ఇలాంటి వారి జీవితాలు, వారి చరిత్రలు చదువుతుంటే ఎంత అద్భుతం అనిపిస్తుంది. యోహాను ఎక్కడైతే బంధింపబడ్డాడో అక్కడ ఒక పెద్ద భవనాన్ని నిర్మించారు. అది యోహాను సాక్ష్యార్థం నిర్మించారు. బైబిల్ కట్టుకథలు, కల్పిత కథల పుస్తకం కాదండి. ఎక్కడో, ఎవ్వడో కూర్చొని రాసేసిన అబద్ధాల పుస్తకం కాదండి బైబిలు. బైబిలులోని ప్రతీ ప్రాంతం, అది ఎక్కడుంది? ఎలా ఉంది అన్నీ మీరు చూడొచ్చు. ప్రతీ దానికి చారిత్రక ఆధారాలున్న దివ్యగ్రంథమే బైబిల్. ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘము వలే మనలను ఆవరించి ఉన్నందున, సులువుగా పాపములో పడవేసే ఈ లోకానికి దూరంగా ఉంటూ, యేసు వైపు చూస్తూ ఈ విశ్వాసం అనే పరుగు పందెంలో ఓపికగా పరుగెడదాం!

**(సమాప్తం)**

లూర్థుస్వామి,
బెల్లంపల్లి

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త

2022 బైబిల్ క్విజ్ సిరీస్‌ను మనం పూర్తి చేసుకున్నాము. ఇక ఫిబ్రవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభిస్తున్నాము.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.

2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/-లు, రెండవ బహుమతి రూ॥ 8,000/-లు, మూడవ బహుమతి రూ. 6,000/- సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**




# పునీత బెర్నదెత్తమ్మ

## (కన్య స్త్రీ, లూర్ధుమాతను దర్శించింది, మతసాక్షి (క్రీ॥శ॥ 1844 – 1879)

పునీత బెర్నదెత్తమ్మ గారి పూర్తి పేరు మేరి బెర్నార్డ్ సౌబిరస్. వీరు క్రీ॥శ॥ 1844 జనవరి 7న ఫ్రాన్సు దేశంలోని లూర్ధు గ్రామంలో జన్మించారు. ఎనిమిది మంది సంతానంలో వీరు మొదటి సంతానం. వీరి తల్లిదండ్రులు ఫ్రాంకోయిస్ మరియు లూయిస్ సౌబిరస్. బీద కుటుంబం. వారి తండ్రి ఒక మిల్లులో రోజు వారీ కూలీ. బెర్నదెత్త గారికి బాల్యం నుండి ఆస్తమా వ్యాధి ఉండేది. జీవనోపాధి నిమిత్తం వారు ప్రక్కగ్రామంలో ఒక ఆయాగా పనిచేశారు. కాస్త పెద్దయ్యాక గొర్రెలమంద కాయడానికి కుదరడమైంది. క్రీ॥శ॥ 1858 ఆరంభంలో తమ 14వ ఏట వారు ఆ పనిమాని స్వంత ఇంటికి చేరుకున్నారు. చదువుకోలేదు. క్రొత్త దివ్యప్రసాదం స్వీకరించలేదు. రోగ పీడుతురాలు. అజ్ఞానం అమాయకత్వమే అందుకు కారణం.

క్రీ॥శ॥ 1858 ఫిబ్రవరి 11న బెర్నదెత్త వంట చెరకు కోసం పుల్లలు ఏరడానికి తన చెల్లి 'మరియె' స్నేహితురాలు 'జేన్'ను వెంటబెట్టుకొని అడవికి వెళ్లారు. అక్కడ బెర్నదెత్త గారు 'కేవ్' నదీ తీరంలో 'మస్సబీల్లె' అనే కొండగూహలో ఒక వింత దర్శనం గాంచారు. వర్ణింప శక్యం కాని ఒక సుందరాంగి కన్పించింది. ఈ విషయాన్ని బెర్నదెత్తగారు మరియె, జేన్‌లకు ఇలా చెప్పారు. "తెల్లని వస్త్రాలు ధరించిన ఒక స్త్రీ మూర్తి 16 లేక 17 ఏళ్లుంటాయి. తెల్లని అంగీతో పాటు నడుముకు నీలిరంగు దట్టీ కట్టుకొని ఉంది. ఆమె తలపై ఒక తెల్లని ముసుగు వస్త్రముండి వెనుకకు వ్రేలాడి ఉంది. (పాదరక్షలు ధరించని) ఒట్టి పాదాలు. ఒక్కోపాదం ఒక్కో గులాబీ పుష్పం ఉన్నాయి. ఆ యమ్మ కుడి హస్తంలో బంగారు గొలుసుకు తెల్లని పూసలు గల జపమాలిక ఉంది. పాదాలవద్ద ఉన్న రోజులతో సహా జపమాల పూసలు బాగా మెరుస్తున్నాయి" అని. పై దర్శనమేకాక ఇంకా 17 సార్లు ఆయమ్మ అదే ప్రదేశంలో బెర్నదెత్తమ్మ గారికి దర్శనమయ్యారు. కొన్ని సందేశాలిచ్చారు. అవి ఫిబ్రవరి 18న "నిన్ను సంతోష పెట్టడానికి మాట ఇస్తున్నాను ఈ లోకంలో కాకున్నా ఆపైలోకంలో" ఫిబ్రవరి 24న "జపము, తపము, ప్రాయశ్చిత్తము", ఫిబ్రవరి 27న "వెళ్లి గురువులకు చెప్పు ఇక్కడ ఒక దేవాలయం కట్టించాలని", మార్చి 25న "నేను జన్మపాప రహితోద్భవిని".

జూన్ 3న బెర్నదెత్త క్రొత్త దివ్యసత్ప్రసాదం స్వీకరించడమైంది. వారు మళ్లీ మస్సబీల్లె (లూర్ధు) గుహకు వెళ్లకుండా లూర్ధు గ్రామ మేయరు ఇనుపముళ్ల కంచె వేయించాడు. బెర్నదెత్త చెప్పేది నిజం కాదని ఆయన ఉద్దేశ్యం. అయినా ఆ కంచె దగ్గర నుండి చూడగా మళ్లీ అదే ప్రదేశంలో మరియ తల్లి ప్రత్యక్షమైంది. అయితే ఈ దర్శనాలన్నీ కల్పితాలని బెర్నదెత్తమ్మ గారిని ఎవ్వరూ నమ్మడం లేదు. ఇంట్లో వాళ్లు, ప్రజలు, ఆఖరుకు గురువులు కూడ నమ్మడం లేదు. ఈ దర్శనాలు సందేశాలను నిగ్గుదేల్చాలని తర్బెస్ పీఠ బిషప్ గారు శ్రీసభ తరపున ఒక సంఘాన్ని నియమించారు. ఇంకా ఒక వైద్య బృందాన్ని కూడ ఏర్పాటు చేసి స్వస్థతలు జరిగిన వ్యక్తులను పరీక్షించి నివేదిక నిమ్మని కోరారు. వీరి పని వీరు చేసుకు పోతున్నారు. కాని ఇంతలోనే లూర్ధు గుహమహాత్మ్యాల సంగతి దావాలనంలా ప్రపంచ మంతటా వ్యాపించింది. తండోతండాలుగా ప్రజలు రావడంతో గొప్ప పుణ్యక్షేత్ర యాత్రాస్థలంగా మారిపోయింది. క్రీ॥శ॥ 1866 జూలైలో బెర్నదెత్తమ్మ గారు కన్యస్త్రీ కావడానికి 'నెవెర్స్ కన్యస్త్రీల సభ'లో ప్రవేశించి నొవిషియేట్‌లో శిక్షణ గడుపుకున్నారు. చనిపోయేవరకు వారు అక్కడే జీవించారు. వారు ప్రతిరోజు చెప్పే విషయం ఒక్కటే "హృదయ పూర్వకంగా ఆ ప్రియమైన గుహవద్దకు యాత్రకు వెళ్తాను". బెర్నదెత్తమ్మ గారు ఆ కాన్వెంటులో ఉన్నంత కాలమూ శారీరకంగా ఆత్మ సంబంధంగా ఎంతో బాధననుభవించారు. కాని వారు మేరిమాత ముద్దు బిడ్డే వారు తమ బాధ్యతను నెరవేర్చుకున్నారు. స్వయంగా వారి మాటల్లోనే ఇలా అన్నారు. "ఒకరు చీపురుతో శుభ్రంగా ఊడ్చాక ఇంక దాంతో పనేముంది? మూలన పెట్టక" దీని అర్థం ఏంటి? శుభ్రంగా ఊడ్చిన తన బాధ్యతను నెరవేర్చుకున్న దేవుని చేతిలోని ఆ చీపురుకట్ట బెర్నదెత్తమ్మ గారే. ఒక కన్యస్త్రీగా సభ కట్టుబాట్లను తు.చ. తప్పక పాటించారు.

క్రీ॥శ॥ 1878 సెప్టెంబరు 22న కన్యస్త్రీగా నిత్య మాటపట్టు తీసుకున్నారు బెర్నదెత్తగారు. అదే ఏడాది డిసెంబరులో వారు తర్బెస్‌పీఠం, నెవెర్స్ పీఠం బిషప్ గార్ల ఎదుట తన ఇరవై ఏండ్ల క్రితం పొందిన మేరీమాత దర్శనాలు, సందేశాలు అనుభూతి గూర్చి గట్టిగా సాక్ష్యమిచ్చారు. తనకు బాల్యంలో ఉబ్బసవ్యాధి ఉందని తన పేదరికం వల్ల, చెమటోడ్చి కూలి పని చేయడంవల్ల వ్యాధి ముదిరిందని పేర్కొన్నారు. ఈ వ్యాధి వల్ల క్షయవ్యాధి సంక్రమించిందని తద్వారా మోకాళ్లలో పుండ్లు, మూత్రపిండాల వ్యాధి ఇలా శ్రమలు సిలువ ప్రీతితో క్రీస్తుకోసం మోస్తున్నానని పలికారు. క్రీ॥శ॥ 1879 ఏప్రిల్ 16న శాశ్వతంగా కన్నుమూసి ధవళవస్త్ర ధారియైన కన్యమరియాంబను కలిసికొన వెళ్ళిపోయారు. క్రీ॥శ॥ 1925లో 15న బెనెడిక్టు గారు బెర్నదెత్తమ్మ గారికి 'ధన్యత' పట్టానివ్వగా క్రీ॥శ॥ 1933లో 11వ పయస్ (భక్తినాథ) జగద్గురువులు వారిని పునీతురాలుగా వెల్లడించారు. బెర్నదెత్త అను పేరునకు ఎలుగుబంటి సాహసం అని అర్థం.

**ధ్యానాంశం**

"నీవు బాధల్ని ప్రేమించడం తెలుసుకోవాలి. మన ప్రభువు తమ మిత్రులకే తను ముండ్ల కిరీటాన్ని ఇస్తుంటారు. ఇంతకంటే ఘనం మరొకటి లేదు. సింహాసనంపై కూర్చున్న రాణీకంటే నేను నా శ్రమలతో పడకపై సంతోషంగానే ఉన్నాను"

(పునీత బెర్నదెత్తమ్మ)




**గత సంచిక తరువాయి భాగం**

శిష్యులు పడవలో పయనిస్తూ ఎదురుగాలిచే శ్రమపడుటను యేసు చూచాడు. నీటిపై నడచివచ్చి వారి పడవనెక్కి పెనుగాలిని శాంతింపజేశాడు. మనం మన జీవితములలో కూడా శ్రమపడుటను యేసు గమనిస్తున్నాడు. మన జీవిత పడవలో ఆయన అడుగిడి మనకు శాంతిని ప్రసాదిస్తున్నాడు. నీటిపై నడుస్తున్న యేసును చూచి శిష్యులు భూతమని భయపడ్డారు. మన జీవితాలలో కూడా ఇలాగే భయపడుతుంటాం. అయితే యేసు ప్రభువు ధైర్యాన్నిస్తున్నాడు. ప్రతి ఒక్కరం కూడా మన జీవితాలలో ఎపుడూ భయపడుతూ ప్రతి చిన్న విషయానికి, సమస్యకు ఆందోళన చెందుతాం. కాని దేవుడు ప్రతిసారి కూడా భయపడక తనయందు విశ్వాసముంచమని కోరుతున్నాడు (యెషయా 41,10; 43,1-5). 4,49 వచనంలో ప్రభువు వారిని దాటిపోవలయునని నీటిపై నడుచుచూ వారి చెంతకు వచ్చాడని మార్కు రాశాడు. 'ప్రభువు దాటి పోవుట' అనగా 'ప్రభువు సాన్నిధ్యము' అని అర్థము. మోయాజు ప్రజల నడిపించుటకును యావే ప్రభువు సాన్నిధ్యమునకు గుర్తుగా యావే తేజస్సును చూడగోరాడు. కాని యావే ప్రభువు మోయాజును కొండ చరియలో దాచి, దాటిపోయారు. మోయాజు యావే వృష్ఠభాగమును మాత్రమే చూడగలిగాడు. ఏలయన ప్రభువు ముఖమును గాంచి ఏ నరుడూ జీవించజాలడు (నిర్గమ 33,18-23). అలాగనే తన ప్రాణమునకై భయపడి హోరేబు కొండమీద దాగుకున్న ఏలియా ముందుగా ప్రభువు సాగిపోయాడు. ప్రభువు ఏలియాను

బలపరచాడు (1 రాజులు 19:11). తన సేవకులు భయపడిన సందర్భములో యావే దేవుడు వారిని దాటిపోయి బలపరచాడు. అలాగనే దైవకుమారుడైన క్రీస్తు భయపడుతున్న శిష్యుల దాటుచు వారి వద్దకు వచ్చాడు.

ఈ విధముగ ఆయన దేవుడు తన ప్రజలను సంరక్షించే విధానం తెలియజేశాడు. భయపడే వారితో ఉండటానికి వచ్చాడు. "నేనే కదా!" అని అభయ మిచ్చాడు. కావున మనం భయపడే సందర్భాలలో ప్రభువు మనలను దాటిపోడు, మనతో ఉండటానికి వస్తున్నాడు. ఇంత జరిగిననూ శిష్యుల బుద్ధి మందగించినట్లే రక్షించే ప్రభువు హస్తము చవిచూసినను మన విశ్వాసం సన్నగిల్లుతుంది.

### 5.5 గెన్నెసరేతు తీరమున స్వస్థత 6:53-56

శిష్యుల బుద్ధి మందగించినను ప్రజలు యేసునందు విశ్వాసముంచారు. ఆయన వస్త్రములు అంచును తాకికూడా అనేక మంది రోగులు స్వస్థత పొందారు. పరిసయ్యులు ధర్మశాస్త్ర బోధకులు యేసును విశ్వసింపక ఆయనను ప్రతిఘటించారు. శిష్యులు కూడా బుద్ధి మందగించి యేసు పలుకులలోని, చర్యలలోని అంతర్యమును గ్రహించలేకపోయారు. కాని సామాన్య ప్రజానీకులు యేసును విశ్వసించారు. స్వస్థత పొందారు. కావున మనం కూడా మన తర్క వితండవాదములు చాలించి, సామాన్యులుగ, దీనతతో యేసునందు విశ్వాసముంచాలి. ఆయనే మన విరిగి నలిగిన జీవితాలను చక్కదిద్దగలడు. నిస్సారమైన మన జీవితాలకు అర్థానివ్వగలడు.

### 5.6 సంప్రదాయ వాగ్వివాదం 7,1-23

మార్కు ప్రజలలో యేసు విజయవంతమైన సువార్త, స్వస్థతా పరిచర్యను వివరించిన తదుపరి ధర్మశాస్త్ర బోధకులు, పరిసయ్యులతో సంప్రదాయము కట్టుబాటుల విషయమై జరిగిన వాగ్వివాదమును వివరించాడు. ప్రజలలో పెరుగుతున్న ఆదరణకు సమతుల్యముగ ధర్మశాస్త్ర బోధకులలో, పరిసయ్యులలో యేసుపట్ల వ్యతిరేకభావం పెరుగుతున్నది. భోజనం చేయు విధానమును గూర్చి ముఖ్యముగా చేతులు కడుగుకొను విషయమై వారితో వాగ్వివాదం సంభవించింది. యెషయా ప్రవక్త ప్రవచనం ద్వారా (యెషయా 29,13) వారి కపట ధోరణిని ఖండిస్తున్నాడు. బాహ్యాచారములకన్నా హృదయశుద్ధి ముఖ్యమని వివరించాడు. అర్పణలు, బలులు కన్నా మానవత్వం మిన్న అని తెలియజేశాడు. బలి అర్పణల కన్న తల్లిదండ్రులను ఆదరించుటయే మేలన్నాడు.

మనిషి ఏమి, ఏలా భుజించునది కాదు ముఖ్యం. మనిషిగైకొను ఆహారం కాదు. మనిషిని మాలిన్యపరచునది, మనిషి హృదయాంతరాలము నుండి వచ్చు దుష్టతలంపులే, దుష్టచర్యలే. హృదయశుద్ధి, చిత్తశుద్ధి ముఖ్యము. మానవత్వము మంటగలిగే ఏ ఆచారమైన సంప్రదాయమైనా దైవామోదం కాదు.

**తరువాయి భాగం వచ్చే సంచికలో**

# శుభవచనం బైబిల్ క్విజ్

**1 మక్కబీయులు 1-16 అధ్యాయాలు**

పేరు ........................ఇంటి పేరు......................విచారణ ...........................

ఫోన్ నెంబర్...............................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

1) యూదులు తమ శిబిరమునకు తిరిగి వచ్చి "ప్రభువు .........................., అతని ........................ నిలుచున"ని గీతము పాడిరి.

2) ఇప్పుడతనికి ............................................................. అని పేరు పెట్టెను.

3) మీరు నా ................................................. కొనసాగుదురేని మిమ్ము ఉచిత రీతిని సత్కరింతును.

4) మా చెంతనున్న ...................................................... మాకు ఓదార్పు చేకూర్చి పెట్టుచున్నవి.

5) సీమోను కుమారుడు ................................................................................ .

6) అతడు గొప్ప సైన్యముతో .................................................................... వచ్చెను.

7) ..................................... దయార్ద్ర హృదయుడు కనుక అతడును, అతని ..........................., ................................. రాజ్యము ఏలిరి.

8) తెల్లవారునప్పటికి యూదా ............................................. మందితో మైదానమున కన్పించెను.

9) అతని సైనికులు చాలా మంది ............................................... కోల్పోయిరి.

10) అతని ................................................... కలకాలము నిలిచెను.

11) అతడు తన ప్రజలను రక్షించి ................................................. కీర్తిని పొందగోరెను.

12) ఇచ్చుట నీ ప్రజలు .............................................. అర్పింపవలయునని నిర్ణయించితిని.

13) ఆనాటి నుండి యూదాకు బదులుగా ............................................ ప్రజలకు నాయకుడయ్యెను.

14) మా ........................... తగినట్లుగా మమ్ము శిక్షింపకుము, మమ్ము ...................అని వేడుకొనిరి.

15) ఆ తావున గుమిగూడి ప్రార్థనలు చేయుట పూర్వము నుండి .................................. అలవాటు.

16) ఇపుడు ..................................... మన మీద కరుణ జూపవలయునని మాత్రము వేడుకొందము.

17) నేను ఉదార .................................. ప్రజల ..................................... చూరగొన్నవాడను.

18) ........................................................ రక్షకుడవైన ప్రభూ! మేము నిన్ను స్తుతించుచున్నాము.

19) వారు గద్ది అను పేరు కల ................................................................. .

20) ఎల్లరును సంతసముతో ................................................ పాడుచు సియోను కొండకు వెళ్లిరి.

21) ............................................. దాని పరిసర భూములు పరిశుద్ధ నగరములుగా గుర్తింపబడును.

22) ఆ లేఖను ............................................................ పౌరుల యెదుట చదివి విన్పించిరి.

23) సిమోను .................................., ..............................., దేవాలయాధిపతిగను పనిచేయును.

24) దేవుని అనుగ్రహము వలన మేము ...................... దాని విధులను ఏ మాత్రము మీరకుందుము గాక.


25) మీరు మమ్ము ........................................................ వెంటనే రావలయును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ ఏప్రిల్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: 2 మక్కబీయులు గ్రంథము 1-15 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

ఒక సమరీయుడు అటు పయనమై పోవుచు అతనిని చూచెను. వానిని చూడగనే అతడు జాలిపడి, వాని దగ్గరకు వెళ్లి గాయములకు తైలము, ద్రాక్షారసము పోసి కట్టుకట్టెను. పిమ్మట వానిని తన వాహనముపై కూర్చుండ బెట్టి, ఒక సత్రమునకు తీసికొనిపోయి పరామర్శించెను" (లూకా 10,33–34) మంచి సమరీయుని ఉపమానమును తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:.................................వయస్సు........తరగతి........స్థలం....................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ ఏప్రిల్ నెల 25 తేదీలోపు మాకు పంపించాలి.

# దేవుడు తన మౌనాన్ని ఛేదించిన సమయం (లూకా 1:5-25)

**గత సంచిక తరువాయి భాగం**

జెకర్యా రుజువు కోసం దేవదూతను ఒక గుర్తును కోరినప్పుడు జెకర్యే గుర్తుగా మారాడు. జెకర్యా మూగతనం అతనికి ఒక దైవిక సంకేతం. కొన్ని సార్లు దేవుని నుండి గుర్తుల కొరకు, సాక్ష్యాల కొరకు పట్టుపట్టడం విశ్వాస జీవితంలో నష్టానికి దారితీస్తుంది. జెకర్యా ఆలస్యంగా బయటకు రావడంతో దేవాలయం బయట ఉన్న వారు ఆందోళనకు గురయ్యారు. ధూపపీఠంపై దేవదూతలచే వధించబడిన అహరోను కుమారులైన నాదాబు మరియు అబీహు (జెకర్యాకు పితరులు) సంఘటన వారికి జ్ఞాపకానికి వచ్చి ఉండవచ్చు. కానీ ఆలస్యమైనప్పటికీ జెకర్యా బయటికి వచ్చాడు. జెకర్యా సైగలతో మాట్లాడటం ద్వారా అతనికి దేవుని దర్శనం అయింది అని ప్రజలకు అర్థమైంది. మరో మాటలో చెప్పాలంటే, జెకర్యా మూగతనం శిక్ష కాదు, గుర్తు మాత్రమే. దేవుడి గొంతు విని ఆయనతో మాట్లాడిన వాడు ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. ఇక అతను దేవుడిని స్తుతించడానికే నోరు తెరుస్తాడు. దేవుని అనుభవం ఉన్నవారు మునులు (మౌని) అవుతారు. వారు దేవుని స్తుతించే, ఇతరులకు క్షేమాభివృద్ధిని కలిగించే మాటలు మాట్లాడుతారు. దేవుని అనుభవం లేని వారు అనవసరమైన, ఇతరులకు క్షేమాభివృద్ధిని కలిగించని మాటలు మాట్లాడే వాచాలతను కలిగి ఉంటారు.

**ఎలిశబేతమ్మ మౌనం**

ఎలిశబేతమ్మ గర్భం దాల్చిన "అయిదు మాసముల వరకు పరుల కంటబడకుండెను" అని లూకా వివరిస్తున్నాడు. దీనికి కారణాలు అనేకం ఉండవచ్చు. ఎలిశబేతమ్మ వృద్ధురాలైనందుకు కొన్ని నెలలు పూర్తి విశ్రాంతిలో గడిపి ఉండవచ్చు. మూగవాడిగా మారిన తన భర్తను అనుకరిస్తూ ఎలిశబేతమ్మ కూడా నిశ్శబ్దతను పాటించి ఉండవచ్చు. కాని, ఎలిశబేతమ్మ కూడా తన భర్త ఐన జెకర్యా వలె అవిశ్వాసంతో ఉంది. గర్భం దాల్చడం నిజమా లేదా భ్రమా? గర్భం ప్రసవం వరకు ఉంటుందా? ఇలాంటి సందేహాలు ఆమెను ఇబ్బంది పెడుతున్నాయి. అతని మూగతనం కారణంగా, జెకర్యా అన్ని విషయాలను సరిగ్గా ఆమెకు వివరించలేక పోయాడు. ఎలిశబేతమ్మ కూడా దేవుని సందేశానికి సంబంధించిన స్పష్టమైన సంకేతం పొందే వరకు విషయాలను రహస్యంగా ఉంచింది అని మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రియ సహోదరి సహోదరులారా, మన జీవితములో దేవుడు మౌనంగా ఉన్నాడు అని మనం భావిస్తుండవచ్చు కానీ దేవుడు తన అనుకూల సమయమున మనం ప్రార్థన ఆలకిస్తాడు, మనకు ఏది క్షేమాభివృద్ధిని కలిగిస్తుందో దానిని నెరవేరుస్తాడు. కాబట్టి మనం నిరాశ చెందకుండా, అవిశ్వాసం లేకుండా నిరీక్షణ కలిగి ముందుకు సాగుదాం. జెకర్యా ఎలిశబేతమ్మ జీవితంలో అసాధారణమైన కార్యాలు జరిగించిన దేవుడు మన జీవితాలలో కూడా అసాధారణమైన కార్యాలు జరిగిస్తాడు అనే ధృడమైన విశ్వాసం, నిరీక్షణ కలిగి జీవిద్దాం.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**యేసు మరణమును జయించి ఉత్థానుడయ్యెను అల్లెలూయ!**

అది ఆదివారము సాయం సమయము. యూదుల భయముచే శిష్యులు ఒక చోట తలుపు మూసికొని ఉండిరి. యేసు వచ్చివారి మధ్య నిలబడి "మీకు శాంతి కలుగును గాక" అనెను. (యోహాను 20,19 మరియు 21)

**ప్రియమైన చిన్నారులారా..!**


భయాన్ని, మరణాన్ని, శాపాన్ని జయించి యేసయ్య విజయాన్ని సాధించారు. పునరుత్థానుడైన యేసు ప్రభు పలికిన మొదటి మాట "మీకు శాంతి కలుగును గాక." సోదరులు ఐక్యమత్యముగా జీవించినపుడు, ఇరుగుపొరుగు వారు స్నేహముగా జీవించినపుడు ఈ శాంతి మన హృదయాలలోను మన కుటుంబములోను మన సమాజములోను జీవధారయై పారుతుంది.

దైవ భీతి కలిగి దైవాజ్ఞలను పాటించే వారు, దైవ ఇష్టాన్ని నెరవేర్చేవారు దేవునికి ఇష్టమయిన వారు. దైవభీతి విజయానికి మెట్టు. గర్వము, మూర్ఖత్వము అపజయానికి సోపానాలు. యేసు ప్రభువు తండ్రి ఇష్టాన్ని నెరవేర్చారు. విధేయతతో తండ్రి దేవుని ఇష్టాన్ని నెరవేర్చారు. అందుకే ప్రపంచంలో అన్ని నామముల కంటే ఘనమైన నామంగా "యేసు" నామం ఎత్తబడింది.

యేసు పునరుత్థాన పండుగ జరుపుకుంటున్న మనం భయం, మరణం, చీకటి, అస్వస్థత, అశాంతి, అనైక్యతల నుండి సంపూర్ణ విముక్తిని పొందిన వాళ్ళం అన్న నిజాన్ని జ్ఞాపకం చేసుకుందాం. పవిత్రమైన జీవితానికి బహుమతి ఉంది. ఉదయాన్నే లేచి జ్ఞానము కొరకు దేవుని ప్రార్థిద్దాం. జ్ఞానం, శాంతి, ప్రేమ తమంతట తామే వచ్చి మన హృదయ తలుపులు చెంత చేరుతాయి.

మరణాన్ని జయించిన యేసయ్య, చెడును జయించి మంచిని పెంచే వారిగా మనలను మార్చమని ప్రార్థిద్దాం.

**గీతం గీతం జయగీతం– చేయితట్టి పాడెదము**
**యేసురాజు లేచెను అల్లెలూయ – జయమర్భటించెదము**



# నేను మీతో చెప్పిన మాటలు ఆత్మయు జీవమునై ఉన్నవి

**"నేను మీతో చెప్పిన మాటలు ఆత్మయు జీవమునై ఉన్నవి" (యోహాను 6,63)**

**ప్రియమైన యవ్వనస్తులారా,**


33 సంవత్సరాలు ఈ లోకములో జీవించిన యేసుప్రభువు పలికిన ప్రతి మాటలు జీవమునిచ్చే మాటగా, ఆత్మనిచ్చే మాటగా ఉంటే, అతను ఎప్పుడు పనికిరాని, వ్యర్థపు మాటలు మాట్లాడలేదు. కుష్ఠరోగితో "నా కిష్టమే నీకు శుద్ధికలుగును గాక" అని పలికి యేసు ప్రభువు ఆ కుష్ఠరోగిని తన మాటతో శుద్ధునిగా మార్చాడు (మత్తయి 8,3). "ప్రభూ! నీవు నా ఇంటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడనుకాను. నీవు ఒక్కమాట పలికిన చాలును" నా సేవకుడు స్వస్థత పొందును (మత్తయి 8,8) అని చెప్పి శతాధిపతి, యేసుని మాటలు జీవమిచ్చె మాటలు అని నమ్మారు; ఆ నమ్మకాన్ని అందరి సమక్షములో ప్రకటించారు. యవ్వనస్తులారా, మనం వెంబడిస్తున్న యేసయ్య మాటలు జీవదాయకంగా ఉంటే, మన మాటలు కూడా జీవదాయకంగా ఉంటాలి. మన మాటలను ఏ విధంగా జీవదాయకంగా మార్చలని మనం నేర్చుకుందాం.

"సంభాషణలలో దుర్భాషలు రానీయక అది వినువారికి మేలు కలుగునట్లు చూడవలెను. సందర్భమును బట్టి వినువారికి దైవానుగ్రహము ప్రసాదింపగల అనుకూల వచనమునే పలుకుడు" (ఎఫెసీ 4,29). మన మాటలతో ఇతరులను మనం

నిరుత్సాహపరచకూడదు. ఇతరులు ఎదగడానికి తోడ్పడే మాటలతో మన పెదవులను మనం నింపాలి. అటువంటి మాటలు సంతోషాన్ని ఆనందాన్ని తెస్తాయి. సామెతలు 12,25 లో మనం చూసినట్లు కరుణపూరిత మంచి మాటలు వలన ఆనందము చేకూరును. తన మాటలయందు తప్పు చేయనివాడు పరిపూర్ణుడే. అట్టివాడు తన శరీరమును అదుపులో ఉంచుకొనగల వ్యక్తి అగుతాడు అని యాకోబుగారు తన లేఖనములో వ్రాసారు (యాకోబు 3,2).

ప్రియమైన యవ్వనస్తులారా! జీవదాయక మాటలుగా మీ మాటలు మారలంటే, మీ పెదవులను దేవుని వాక్యలతో మీరు నింపాలి. పరిశుద్ధ గ్రంథమును రోజు చదివేవారు, వారు చదివిన వాక్యాన్ని బట్టి తమ జీవితమును శుద్ధి చేసి, వెలుగునకు చెందిన వారలుగా జీవిస్తారు. అటువంటి వారి జీవితములో పాపపు చీకటి ప్రభావము ఉంటదు. వారు సరియైన మార్గము గుండా ప్రయాణిస్తారు. తమ నాలుకను అదుపు చేసుకోలేని వారు, తమ ఆలోచనలను, క్రియలను అదుపు చేసుకోలేక నాశములోకి ప్రయాణించే వారులవుతారు. కాబట్టి ప్రియమైన యవ్వనస్తులారా, మీ మాటలను యేసయ్య వాక్యముతో సరిదిద్దుకొనే ప్రయత్నాలు మీరు చేయాలి. మంచి మాటలతో, మన జీవితాలను, ఇతరుల జీవితాలను వెలుగించే వారలుగా మనం మారుదాం.


# ప్రార్థనాంజలి ప్రార్థన పుస్తకము




ఈ ప్రార్థనా పుస్తకము కుటుంబంలోని ఒక అమూల్య నిధిగా పరిగణించి దీనిని ఉపయోగించుకొని, ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం కృషి చేయండి. ఇందులోని మొదటి భాగంలో అందరు నేర్చుకోవాల్సిన ప్రాథమిక ప్రార్థనలున్నాయి. రెండవ భాగంలో, విశ్వాసులందరు తెలుసుకోవాల్సిన విశ్వాస సత్యాలు కనిపిస్తాయి. ఈ సత్యాలను అందరు శ్రద్ధగా చదివి నేర్చుకోవాలి. మూడవ భాగంలో వివిధ సందర్భాల కొరకు ప్రార్థనలు కలవు. ప్రతిదినం కుటుంబంలో ప్రార్థించాల్సిన ప్రార్థనలు నాలుగవ భాగంలో ఉన్నాయి. తపస్సు కాలంలోని శుక్రవారాల్లో సిలువ మార్గము చెప్పడానికి వీలుగా ఐదవ భాగంలో సిలువ మార్గం ముద్రించడం జరిగింది. ఈ పుస్తకాన్ని మీ ఆత్మీయ మిత్రునిగా భావించి ఎల్లప్పుడూ ప్రార్థనా శక్తితో జీవించే అలవాటును స్వంతం చేసుకోండి.

**ప్రతులకు మమ్ములను సంప్రదించండి.**

# బైబిల్ దృశ్యమాలిక



మళ్లీ ప్రయాణం సాగించి సీనాయి కొండకు వచ్చారు.
ఇదే యెహోవా పర్వతం. మనం ఇక్కడ గుడారాలు వేద్దాం
!!!
జోషువా, నేను ప్రార్థన చేయుటకు వెళుతున్నాం. ఆరోను, దయచేసి ప్రజలను చూచుకో మేము ఆలస్యంగా రావచ్చు.
వీళ్ల స్వభావం నీకు తెలుసుగా?
ఇంకా ఏమి చేయాలి?

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**హగ్గయి 1-2; మలాకీ 1-4 అధ్యాయాలు**

1). గౌరవింతురు (మ 1,11)

2). మందిరమును (మ 2,11)

3). శుభములను (హ 2,9)

4). జీవమును, క్షేమమును (మ 2,5)

5). హగ్గయి (హ 1,,3)

6). దేవుని, యాజకుల (మ 2,7)

7). యాకోబును (మ 1,2)

8). విడాకులను (మ 2,16)

9). మార్గమును, దూతను (మ 3,1)

10). రక్షణము (మ 4,2)

11). ఆరోగ్యము (మ 4,2)

12). మందిరము (హ 1,9)

13). యిరువది నాల్గవ (హ 2,20)

14). పాప మార్గముల (మ 2,6)

15). ఆజ్ఞను (మ 2,4)

16). భగ్నము (మ 2,8)

17). ప్రభువునకు (మ 2,12)

18). చెంతకు, మీ చెంతకు (మ 3,7)

19). పదియవ (మ 3,10)

20). జ్ఞాపకార్థముగా (మ 3,16)

21). బలిపీఠము, అపవిత్రమైన (మ 1,7)

22). తోడుగా, భయ (హ 2,5)

23). తీర్పు (మ 3,5)

24). కౄరముగా (మ 2,16)

25). ధర్మమునే (మ 2,6)

**వచ్చే నెల పాఠ్యాంశం: 2 మక్కబీయులు గ్రంథము 1-15 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com